# తల్లి భూదేవి

యుద్ధ భూమిలో మోహరించిన సైన్యాల్లా ఆకాశంలో నల్లని కారు దున్నల్లాంటి మేఘాలు క్రమ్ముకున్నాయి.

ముఖంలో నుండి పరమానందం పురుకుతూండగా చేతిలోని చుట్ట ఆరిపోయినా లెక్కచెయ్యకుండా ఆకాశంవైపు కృతజ్ఞతగా చూస్తున్నారు రైతులు. కొందరు వెంటనే అటకల మీంచి నాగళ్ళు తీసి పేని పుంచిన పలుపులు కడుతున్నారు. కొత్త కర్రు వేయించడానికి కొందరు వడ్రంగి ఇంటివైపు నాగళ్ళతో వెళుతున్నారు.

'అబ్బ ఎన్నాళ్ళకెన్నాళ్ళకీ!' అనుకుంటూ భూదేవి పులకించి పోతూంటే, చెవులాడించుకుంటూ మోరలెత్తి నింగివైపు ఆశగా చూస్తున్నాయి పశువులు.

ఇందరి ఆశల్ని వమ్ము చేయ సాహసించలేక కాబోలు టపటప చినుకులతో మొదలై మూడుదిక్కుల వర్షం కుండపోతగా కురిసింది.

చీకటితోనే లేచి ఇంకా సన్నగా జల్లు పడుతున్నా లెక్కచెయ్యకుండా భుజాన నాగళ్ళు వేసుకుని పశువుల్ని తోలుకుంటూ పొలాలకి నడిచారు రైతులు. ఎర్రని వాన నీళ్ళతో తన అణువణువూ ఆనందంతో మెరిసిపోతూంటే రైతు బిడ్డలకి సుస్వాగతం పలుకుతోంది భూదేవి.

గత రాత్రే సిద్ధపరచిన నాగల్ని వీధిలోకి తెచ్చారు రామయ్య. ఆయన భార్య నాగలికి పసుపురాసి బొట్టు పెట్టి కొబ్బరికాయ కొట్టి ఎదురు రాగా అతిశయించిన ఆనందంతో దుక్కి టెద్దుల్ని తోలుకుంటూ భుజాన నాగలితో పొలం వైపు నడిచారు.

చేలో దిగే ముందు మరో కొబ్బరికాయ కొట్టి చేలోని కాస్త మట్టి తీసి బొట్టు పెట్టుకుని అరకలి కట్టారాయన.

రామయ్యగారి వంశం మొదట్నుంచీ వ్యవసాయం మీద ఆధార పడి బ్రతికిందే. అందుకే ఆ వంశస్తులందరికీ భూమి అంటే ఎనలేని ప్రేమ, గౌరవం, మాతృభావం.

మిగిలిన వారి కంటే రామయ్యగారీ విషయంలో రెండడుగులు ముందున్నారనే చెప్పాలి. రైతు భూమి యొక్క ముద్దు బిడ్డ గనుక పంటల్ని ఆమె అతడికీ అతడి ద్వారా లోకానికీ అందిస్తోంది. గనుక రైతు ఆ పవిత్ర కర్తవ్యం నెరవేర్చడం వల్లే ధన్యాత్ముడవుతాడని ఆయన నమ్మకం. తను అలా అవ్వాలని ఆయన ఆశ! ఆరాటం!

అటు వంటాయనకి పొలమంటే ఎంతో ఆపేక్ష వుండటంలో ఆశ్చర్యం ఏముందీ.

అతడి తండ్రి అతడి కిచ్చిపోయింది ఇప్పుడు దున్నుతున్న నాలుగె కరాల చెక్కే. దాని వెనకో చిన్న కథ వుంది కూడా.

రామయ్య తండ్రి హయాం వరకూ ఆ వంశంలోని ఎవరికీ స్వంత భూముల్లేవు. కౌలుకి వ్యవసాయం చేసేవారంతే. అప్పుడోసారి ఈ నాలుగెకరాల చెక్క అమ్మకాని కొస్తే కొందామని చూశారాయన. కాని దగ్గరున్న డబ్బు చాల్లేదు. అప్పుడు భార్య కాసులపేరు తాకట్టు పెడతా నన్నారు. ఆమె ఇవ్వడాని కిష్టపడకపోతే తప్పకుండా వచ్చే పంటల్లో

వస్తువు వదిలిస్తానని చేతిలో చెయ్యివేసి హామీ ఇచ్చారు. కాని అదే రోజు రాత్రి నిద్రలో నిద్రపోతున్నంత తేలిగ్గా ప్రాణాలొదిలారు.

అప్పటికి రామయ్యగారికి ఇరవై ఏళ్ళు. తండ్రి దినవారాలకి డబ్బు లేక తాకట్టు పెట్టిన కాసుల పేర్ని ఆ మార్వాడీకే అమ్మేశారు.

తల్లి కెంతో ఇష్టమైన కాసుల పేరుతో కొన్న పొలం అది. తండ్రి తన కిచ్చిపోయిన ఆస్తి అది. తమ వంశంలో ప్రప్రథమంగా స్వంతమైన భూమి అది. అందుకే అదంటే అంత ఇష్టం రామయ్యగారికి. ఆ భూమిలోని ప్రతి అణువూ ఆయన చేతి చల్లదనాన్నీ ఆప్యాయతనీ చవి చూసిందే.

అదీగాక మరో మూడెకరాలు కొన్నారు రామయ్యగారు. కాని కొడుకు పై చదువుల దృష్ట్యా చేసిన అప్పు తీర్చడానిగ్గాను అమ్మకతప్పక అమ్మేశారు. అప్పుడాయన అనుభవించిన దుఃఖం వర్ణనాతీతం. కన్నతల్లి తలకి నిప్పంటించిన రోజున కూడా ఆయనంత బాధ పళ్ళేదు!

"ఈ వయస్సులో వ్యవసాయం ఎందుకునాన్నా. హాయిగా మాతో పాటొచ్చి వుందురుగాని రండి. పైగా ఈ రోజుల్లో వ్యవసాయాలేమన్నా మిగిలేదుస్తున్నాయా ఏమన్నానా!" అన్నాడు హైదరాబాదులో వుద్యోగం చేస్తున్న రామయ్యగారబ్బాయి.

"ఉద్యోగాలంటూ ఊళ్ళు పట్టుకుపోయిన మీకు తెలీదురా పుట్టిన గడ్డ విలువా పండే భూమి విలువానూ. మీరేం మమ్మల్ని వుద్ధరించక్కర్లేదు గాని మమ్మల్నిలా మా త్రోవన బ్రతకనివ్వండి చాలు. దేవుడిచ్చిన రెక్కలున్నాయి. తండ్రిచ్చిన భూముంది. ఇంక మాకు లోటేమిట్రా? అప్పుడప్పుడూ ఎదురుదెబ్బల్లాటివి తగిలినా భూమిని నమ్ముకున్న వాడె వడూ చెడిపోడురా. ఏది ఏమైనా సరే మా తనువులీ గడ్డమీద రాలిపోవా

ల్సిందే. ఈ మట్టిలో కలిసి పోవాల్సిందే" అని ఖండితంగా చెప్పేశా రాయన.

అతడు మళ్ళీ మాట్లాడలేకపోయాడు.

ఏ మాట కామాటే చెప్పుతోవాలి. రామయ్యగారి భార్యకి పల్లె బ్రతుకు విసుగ్గా వుంది. ఒంట్లో ఇది వరకటి శక్తి లేదు. అందుకని పట్నంలో కొడుకూ కోడళ్ళతో హాయిగా వుంటే బాగుణ్ణను కొంటోంది. కాని భర్త అందుకు సమ్మతించడని తెలుసు. అందుకే కొడుకు మాటలకి వత్తాసు పలకలేక మౌనంగా వుండి పోయిందామె.

సూర్యుడు నడినెత్తి మీదికొచ్చాడు.

రామయ్యగారికి ఆకలిగాలేదు. పొలం సాంతం దున్ని పారేయాలని వుంది. కాని ఎప్పుడో చీకటితో కట్టాడు నాగలి. దూడలు బాగా అలసి పోయాయి. కాస్సేపు వాటికి విడుపివ్వాలని నాగల్ని విప్పి భోజనానికి ఇంటి కెళ్ళారాయన.

"అబ్బాయొచ్చాడండీ" వీధిలోనే ఎదురై అంది భార్య.

"ఏడి?"

"భోం చేస్తున్నాడు"

"ఏరా ఎంతసేపయ్యిందిరా వచ్చి?" వంటింటి గుమ్మంలో నిలబడి అడిగారు.

"ఇంతక్రితమే నాన్నా"

"కోడలూ పిల్లలూ అంతా బాగున్నారా?"

"ఆఁ బాగానే వున్నారు"

"వాళ్ళని కూడా తీసుకురాక పోయావుట్రా అందర్నీ చూసెడ్దరూ"

"కుదర్లేదు...."

భార్యా, కొడుకూ ముఖాల్లో ఏదో ఇదైన భావం-చెప్పనా వద్దాఅన్న తటపటాయింపూ కన్పించాయి. కాని తన ధ్యానలో పడి ఆయన దాన్ని పట్టించుకోలేదు.

ఆ రోజు రాత్రి అన్నాడు రఘు తండ్రితో "ఆఫీసులో అర్జంటుగా పదివేలు కట్టాల్నాన్నా"

ఆయన గుండెల్లో రాయిపడింది. కళ్ళు పెద్దవి చేసుకుని చూశారు ఎందుకన్నట్టు.

"నేను పెద్ద ఇంజనీర్నని నీకు తెలుసుకదా. పదివేలు డిపాజిట్ కట్టమన్నారు. మళ్ళీ వో అయిదేళ్ళు పోయాక వడ్డీతో సహా తిరిగిచ్చేస్తారు. లేకపోతే వుద్యోగం పోతుంది....

కొంచెంసేపయ్యాక మెల్లగా అన్నారాయన భార్యతో "విన్నావుటే ఎందుకొచ్చిన చదువులూ ఎందుకొచ్చిన వుద్యోగాలూ అని నెత్తీ నోరూ కొట్టుకున్నా మీరు వినలేదా రోజున. చూడివాళ ఏమయ్యిందో. తుమ్మితే వూడే ముక్కు కన్నా అధ్వాన్నమయ్యింది. ఆ వెధవ మాయదారి చదువు వెంట పరుగెత్తకుండా ఇంటి పట్టునే వుండి వ్యవసాయం చేసుంటే నిక్షేపం లాంటి ఆ మూడెకరాలూ అమ్మాల్సొచ్చేది కాదు. అదీ ఇప్పుడున్న నాలుగెకరాలూ పెరసి ఏడెకరాలుండేవి. దాంతో వీడూ వీడి పిల్లలూ రాజాలా కాలు మీద కాలువేసుకుని బ్రతికేవాడు కాదూ? అవాళ అమ్మా కొడుకూ నామాట విన్నారా? మాటాడితే నువ్వు సత్తెకాలం వాడి వంటారంతే. చూడండి ఇప్పుదేమయ్యిందో. ఇప్పటికిప్పుడు పదివేలు సర్దటమంటే మాటలా?!"

"అసలే బిడ్డ బాధతో చిక్కిసగమైపోతూంటే మధ్యన మీ సాధింపులేమిటండీ. చెయ్యాల్సిందేవిటో ఆలోచించక ఈ చిందు లేవిటీ-హవ్వ-ఎవరైనా వింటే నవ్విపోరూ!" భార్య అంది.

"అదీ తెలుసులేవోయ్. ఇప్పుడేం చేద్దామంటారో మీరే చెప్పండి. పోనీ కొలువు మాని వచ్చి వ్యవసాయం చేస్తాదేమో అడుగు నీ కొడుకుని"

"అయ్యో రామ! ఇంత బ్రతుకు బ్రతికి ఇంటెనకాల చచ్చినట్టు...."

"వ్యవసాయం నీ కంటి కంత హీనంగా కన్పిస్తోందటే" వురిమి చూస్తూ అన్నారు.

"అదీ కాదండీ తెల్ల బట్టలు కట్టుకుని నీడ పట్టున బల్లమీద కూర్చుని రాసుకోడం తప్ప వాడికి వ్యవసాయమేం తెలుసండీ వాడి మొఖం! ఎప్పుడైనా పొలం వెళ్ళేడా మేడితోక పట్టాడా!"

"అంత నాజూకైన బట్టలేసుకొని పోగ్గా తిరగబట్టే లోకం కరువుతో ఏడుస్తోందే ఇంతకీ ఇప్పుడేమంటావురా. మీ అత్త వారేమైనా సర్దుతారా?

"వూహూ॥"

"మరేం జేద్దామంటావు?"

"పోనీ మన పొలాన్ని తణఖా పెడితే?" భయపడ్తూనే అన్నాడు.

"ఏంటీ? ఆ నాలుగెకరాల కొంప్రడనా? అది నువ్వూ నేనూ సంపాదించింది కాదురా ఇష్టం వచ్చినట్లు తగలెయ్యడానికి!" ఆవేశంగా అని ఒగర్చసాగారు రామయ్యగారు.

"మీరు పొలం తణఖాకి ఒప్పుకోరాయె. వాడు వుద్యోగం వదులుకోడయ్యె. మరీ చిక్కుముడెలా విడుతుందండీ,"

"ఏమో ఎలావోలా ఏడవమను!"

ఇంకేమంటే, ఇంకెలా నచ్చచెబితే తండ్రి ఒప్పుకుంటాడో రఘుకి తోచలేదు.

అతడికి వుద్యోగం చెయ్యడం ఇష్టం లేదు. మరో మిత్రుడితో కలిసి స్వయంగా వో చిన్న పరిశ్రమ స్థాపించడానికి నిర్ణయించుకొన్నాడు,

బ్యాంకు వారు కూడా ఆర్థిక తోడ్పాటు నిస్తానన్నారు. తన వంతు పెట్టు బడి నిమిత్తం వచ్చాడతడు. నిజం చెబితే భూమి అమ్మడానికి తండ్రి ఒప్పుకోడని అలామార్చి చెప్పేడు. అయినా ఒప్పుకోకపోయేసరికి మరేం చేయాలో పాలుపోలేదు.

చివరి అస్త్రంగా అన్నాడు "పోనీలే అమ్మా. నాన్నకి నేనిలా గౌర వంగా బ్రతకటం ఇష్టంలేదు. అందుకే కొడుకున్నా కొడుకు గౌరవం కన్నా ఆ పొలమే ఎక్కువన్నట్టు మాట్లాడుతున్నాడు! విలువలేకపోయాక నే నింకెందుకూ వుండటం. వెళ్ళిపోతాను. ఎవరికాళ్ళో పట్టుకుంటాను. ఉద్యోగం పోతే ఎక్కడో అక్కడ అడుక్కు తింటాను. ఎలాగో ఛస్తాను. మేమెలా పోతే మీకేం మీరూ మీ పొలమూ నిక్షేపంలా వుంటే చాలుగా!"

"అవేం మాటల్రా అబ్బాయ్...." తల్లి మనస్సు కరిగి నీరయ్యింది

"ఇంకెలా మాట్లాడనమ్మా? ఉద్యోగం నిలబడితే రెండు నెలల్లో తణఖా వదిలిస్తాననీ ఇంకో నాలుగు నెలల్లో మరో నాలుగెకరాలు కొంటా ననీ చెబుతున్నా విన్నప్పుడేం చెయ్యను?" అని లేచాడు కళ్ళనీళ్ళు పెట్టుకుని

"అన్నం తిని వెళ్ళువుగాన్లేరా"

"నాకేం వద్దమ్మా! నాకీ ఇంటితో ఋణం తీరిపోయింది"

"ఛా-అవేం మాటల్రా పిచ్చి నాన్నా. మీ నాన్నే ఏదో ఆలోచి స్తార్లే. ఏదో దారి చూసి నిన్ను గట్టున పడేస్తారుగాని ముందు కాళ్ళు కడుక్కో- అన్నం తిందువుగాని"

నిజంగానే ఆలోచనలో పడ్డారు రామయ్యగారు.

కొడుకలా బాధగా కన్నీళ్ళు పెట్టుకుని నిష్ఠూరంగా మాట్లాడే సరికి ఆయన ప్రాణం విలవిల్లాడింది.

పోనీ తణఖా పెడితేనేం?

త్వరలోనే అప్పుని వాడే తీర్చేస్తానంటున్నాడుగా. తను మహా

బ్రతికితే పదేళ్ళు. ఆ తర్వాత ఎలాగూ ఆ పొలం వాడికి చెందేదేగా. పోనీ ఇప్పుడే వాడికి వుపయోగపడనీ. వాడి ప్రాణం వుసూరు మనటం ఎందుకు? తనఖా పెట్టినంత మాత్రాన పొలం వాళ్ళదై పోదుగా!

మెత్తబడ్డారాయన. అంతలోనే పొలాన్ని తాకట్టు పెట్టడమా అని సంశయించారు. బాధ పడ్డారు.

"అయితే వెంటనే బాకీ తీర్చెయ్యగలనంటావ్?"

"రెండుమూడు నెలల్లో పూర్తిగా తీర్చిపారేస్తాను"

ఇంకటువంటప్పుడు ఒప్పుకుంటేనేం అన్పించింది. "సరేలే-అలాగే కానియ్యి తప్పుతుందా" అని లేచి బయటి కెళ్ళిపోయారాయన.

రఘు ఆనందాని కంతం లేదు. వెంటనే గోపాలం గారింటికెళ్ళి అంత క్రితం సుచాయిగా అనుకున్న దాన్ని స్థిరపరిచాడు. ఎట్టి పరిస్థితిలోనూ పొలం అమ్మినట్లు తండ్రికి తెలీనివ్వకూడదని షరతు పెట్టాడు. కేవలం తణఖా పెట్టుకుని డబ్బిస్తున్నట్టు చెప్పమనీ తండ్రి నెలాగైనా హైదరాబాదు తీసుకుపోతాననీ చెప్పాడు.

మరో రెండు అబద్ధాలతో రిజిస్ట్రేషన్ వ్యవహారం పూర్తయ్యింది. పొలం గోపాలంగారి పరమైపోయింది.

"నాన్నా! అమ్మకి బీపీ ఎక్కువగా వుంది. హైదరాబాదు తీసుకెళ్ళి పెద్ద డాక్టర్లకి చూపిద్దామనుకుంటున్నాను. నువ్వొక్కడివీ ఇక్కడెందుకూ నువ్వు కూడా వచ్చెయ్యి"

"మీ అమ్మ బాగానే వుంది కదరా"

"అలాగే వుంటుంది. అమాంతం ముంచేస్తుంది. ఆ రోగ లక్షణమే అంత నాన్నా"

"పోనీ దాన్ని తీసుకెళ్ళరా. నేనేదో ఇంత వుడకేసుకుని తింటాన్లే. భూమిని వదిలినేనెలా రాను రా?"

"సయమవడానికి చాలా టైం పడుతుంది నాన్నా పత్యం ఆపీ ఆబ్స్ చాలా చెయ్యాలి. అన్నాళ్ళు నువ్వొంటరిగా వుండలేవుగాని నా మాట విను. పొలం గురించి బెంగపడొద్దు. మన దగ్గరిదివరకు పాలేరుగా చేశాడూ-బసవన్న-వాడికీసారికి 'పాలు' కిద్దాం. వాడికి వ్యవసాయమంటే ఎంత శ్రద్ధో నువ్వంటే ఎంత భక్తో నీకు తెలీంది కాదుగా"

"అవునసుకో. ఏమైనా స్వయంగా పాలూనీళ్ళు చూసుకోవడం వేరు ఇతరులు చూట్టం వేరు. వాళ్ళకి మన కున్నంత శ్రద్ధ వుంటుందా-అయినా ఆ తృప్తే వేరు!"

"నువ్వు ప్రతిదానికీ ఇంతే. లోకంలో నువ్వు తప్ప ఇంకెవరూ వ్యవసాయం చెయ్యడం లేదూ? అంతా నీలాగే అంటిపెట్టుకు నుంటున్నారా?"

"వాడంత అభిమానంగా అడుగుతూంటే రానని మొండి కేస్తారేంటీ. పోనీ వెళ్ళి నాల్రోజులుండి వద్దాం. మీకూ ఈ మధ్య ఆరోగ్యం బాగుండటం లేదు కదా. డాక్టరుకి చూపించు కున్నట్టూ వుంటుంది. ఆట విడుపుగానూ వుంటుంది. పిల్లలతో నాల్రోజులు కాలక్షేపం చేసినట్టూ వుంటుంది." భార్య అంది.

ఎట్టకేలకు అతి కష్టం మీద ఒప్పుకున్నారు. బసవన్నకి మూడొందల సలహాలూ జాగ్రత్తలూ చెప్పి విడువలేక విడువలేక పొలాన్ని విడిచి హైదరాబాదు బస్సెక్కారు భార్య కొడుకులతో కలిసి రామయ్యగారు.

డబ్బు అందటంతో స్వంత పరిశ్రమ స్థాపనలో పడ్డ రఘు తల్లినీ తండ్రినీ దక్షిణ దేశయాత్రలు చేసి రమ్మని టూరిస్టు బస్సు ఎక్కించాడు.

అందరితో బాటే రామయ్యగారు స్నానాలు చేస్తున్నారు. గుళ్ళలోకి వెడుతున్నారు. మొక్కులిస్తున్నారు. వూళ్ళూ విశేషాలూ చూస్తున్నారు. కాని మనస్సు మాత్రం తన నాలుగెకరాల భూమి చుట్టూనే తిరుగుతోంది!

ఈ పాటికి చేను 'మోన' తిరిగి వుంటుంది. పొలం పచ్చని పరికిణీ జాకెట్టూ ధరించిన పదేళ్ళ పిల్లలా వుండి వుంటుంది. బసవన్న నీళ్ళవీ సరిగ్గా చూస్తున్నాడో లేదో! పెథవ ఎరువులు వెయ్యొద్దు పెంటాపేడా చల్ల మని పదే పదే చెప్పాడు. ఏం చేస్తున్నాడో ఏమో! ఎలుకలు చేసుని పాడు చెయ్యకుండా ఎలుకల బోనులు పెట్టాడో లేదో!

ఇలా సాగుతోంది నిరంతరం ఆయన ఆలోచనా స్రవంతి!

ఎవరితోనూ—ఆఖరికి భార్యతో కూడా మాట్లాడటం లేదు. ఏమైనా తిందామని గాని అటూ ఇటూ తిరిగి చూద్దామని గాని అనడం లేదు. మౌనంగా ఈ లోకంతో సంబంధం లేనట్టుంటున్న భర్తని చూసి ఆయన భార్య ఒకటే ఆదుర్దాపడుతోంది. ఇదంతా పొలం మీది ధ్యాసేనని సరి పెట్టుకోలేకపోతోంది. కాషాయాంబరాలు ధరించిన సన్యాసులు కన్పిస్తే చాలు ఆయనా వాళ్ళతో కలిసి పోతాడేమోనని "ఈ మాయదారి యాత్రలకి రాకుండా వున్నాపోను....అని కన్నీళ్ళతో అనుకుంటూ ఆయనచెయ్యి గట్టిగా పట్టుకుంటోంది.

తమిళనాడులో ఓచోట పూరిబయట పిల్లలెవరో వెంటికెళ్తానంటే బస్సాపారు. సరదాగా దిగిన మరి కొందరితోబాటు రామయ్యగారూ దిగారు. కొంచెం దూరంలో పచ్చని చేలు కనిపించాయి. హుషారుగా అటు నడిచాడాయన.

అంతా ఎక్కారనుకుని బస్సు కదిపారు. ఆయన రాలేదంటూ ఘొల్లుమంది రామయ్యగారి భార్య బస్సాపి ఆయన్ని పిలిచారు. గట్టిగా కేకలు పెట్టారు. కానాయన విన్పించుకోలేదు. వారివంక చూడనుకూడా లేదు.

క్లీనరెల్లాడు విసుక్కుంటూ. అతడెళ్ళేసరికి రామయ్యగారు "ఈ విత్త నం ఏమిటి? పుడ్చి ఎన్నాళ్ళయ్యింది? దిగుబడి ఎలా వుంటోంది?"

అంటూ అక్కడున్న ఆసామీని ప్రశ్నిస్తున్నారు. భాష అర్థంగాక అతడు నోరు తెరచి చూస్తున్నాడు!

రామయ్యగారికి క్లీనరు సమాధానాలు చెప్పి వెనక్కి తీసుకొచ్చే సరికి అతగాడి తలప్రాణం తోలి చిటికెనవ్రేలికొచ్చేసింది!

ఇంటికెళ్ళగానే కొడుకుతో భర్త పరిస్థితి చెప్పి కళ్ళనీళ్లు కుక్కుకుంది రామయ్యగారి అర్ధాంగి.

రఘుకి అయోమయంగా వుంది. తండ్రివాలకం పెరిగినగెడ్డం నీరసపడ్డ శరీరం చూస్తోంటే ఏదో భయంగా వుంది. ఇదంతా ఆ భూమి గురించే అనుకోడానికి అది అమ్మేసినట్లు ఆయనకి తెలీదుకదా అనుకున్నాడు. మరో కారణమేదీ బోధపడకపోయేసరికి బహుశా వాతావరణ మార్పువల్ల కాబోలని సరిపెట్టుకొన్నాడు.

ఓ ఆదివారంనాడు ఓ స్నేహితుడి కార్లో హైదరాబాద్ అంతా తిప్పాడు తల్లిదండ్రుల్ని రఘు. రామయ్యగారెంతో ఆశ్చర్యంగా చూడటం నిజమేకాని పచ్చని పొలాలకోసం పచ్చపచ్చని చెట్లకోసం అంతకంటే ఎక్కువ ఆసక్తితో వెదికారు కానక్కడేమున్నాయి రాళ్ళూ రప్పలూ కొండలూ మేడలూ హంగులూ పొంగులూ తప్ప!

రామయ్యగారు బెంగపడినట్టు అర్థమైపోయింది రఘుకి. ఎలా వోలా నలుగుర్లో కలిపేట్టు చెయ్యకపోతే ప్రమాదమనుకొన్నాడు. తెలిసువున్న వాళ్ళళ్ళకి సినిమాలకి పార్కులకి వెళ్తాండమని అదే పనిగా పోరగా ఓ రోజున పార్కుకెళ్ళి తనకి ముఖపరిచయం వున్నవారి దగ్గరి కెళ్ళి కూర్చున్నారు.

ఇందిరాగాంధీ, అత్యయిక పరిస్థితి అత్యాచారాలు, జనతాప్రభుత్వం. అమెరికా ప్రెసిడెంట్ ఎలక్షన్, ఆఫీసు పాలిటిక్స్—వగైరాలు మాట్లాడుకుంటున్నారంతా.

రామయ్యగారు చాలా హతాశుడయ్యారు. పొలాల గురించీ పంటలు గురించీ మాట్లాడుకోలేం అని విసుక్కున్నారు. నిరాశపడ్డారు లేచి పైపంచె దులిపి చక్కా వచ్చేశారు.

అలాగే మనుమలతోనూ కాలక్షేపం చెయ్యలేకపోయారాయన.

కాన్వెంట్లో చదువుతోన్న పిల్లలు 'గ్రాండ్ పా' అంటూ ఇంగ్లీషూ తెలుగూ కలిపి ఏదేదో మాట్లాడేవారు. అదేమీ ఆయన కర్థమయ్యేదికాదు. పైగా వాళ్ళని ఒళ్లో కూర్చోబెట్టుకోవాలనీ బుగ్గగిల్లాలనీ వీపు మీదెక్కించు కోవాలనీ తనకి తెలిసిన పూర్వీకుల కథలు చెప్పాలనీ ఎంతో ఇదిగా వుండేది. కాని యూనిఫాంలో దొరబిడ్డల్లా వుండేవాళ్ళని దగ్గరకి తీసుకో సాహసించలేకపోయేవారు. వాళ్ళు గొప్పవాళ్ళనే భావం కలిగేది గాని తనవాళ్ళు అన్న భావం ఏకోశానా కలిగేది కాదాయనకి.

దాంతో ఒంటరితనం పీలవసాగారాయన. అప్పుడప్పుడూ భార్య వాళ్ళలో ఎలా కలిసిపోగలిగిందా అని ఆశ్చర్యపడుతూండేవారు.

ఒకనాటి ఉదయం అంతా లేచినా రామయ్యగారు లేవకపోయేసరికి కంగారుపడి వెళ్ళి చూశారంతా. ఆయన ఒళ్లు విపరీతంగా కాలిపోతోంది కొంచెంగా మూలుగుతున్నారుకూడా. వెంటనే డాక్టర్ని పిలిచారు.

మామూలు జ్వరమేననీ నాల్రోజుల్లో తగ్గిపోతుందనీ చెప్పేడాయన.

బహుశా యాత్రలో వేళకి అన్నం పానం అమరి వుండవు గనుక తేడాచేసి వుండి వుంటుందనుకున్నారంతా.

కాని రామయ్యగారలా అనుకోలేదు. తను పుట్టి ఎరుగున్నాక తనకి పెళ్లనజ్వరం రావడం ఇదిగో ఇప్పుడే. ఈ వయస్సులో వచ్చిందంటే చావు ఘడియ సమీపించినట్టే అనుకున్నారు.

ఆ సాయంత్రమే కొడుకుని పిలిచి ఓ అయిదొందలు కావాలని అడిగారు.

ఎందుకన్నట్టు చూశాడు రఘు

"కావాలి. పనుంది" కాస్త మొండిగానే అన్నారాయన.

మరి తర్కించకుండా తెచ్చిచ్చాడు.

"పిచ్చివాడు! నేనెందుకడిగానో అనుకుంటున్నాడు. నే నే అర్ధ రాత్రో గుటుక్కుమంటే సమయానికి చేతిలో కాణీ లేక ఇంట్లో శవాన్ని పెట్టుకుని వూళ్ళో అప్పుకి తిరగాల్సొస్తుందని తెలీదు. అవాళ తన తల క్రింద అయిదువందలూ కన్పించాక అనుకుంటాడు మా నాన్న ఎంత ముందు చూపు కలవాడూ అని! అంతేనా నాయనా. మన వూరూ మనవాడా గాక పోయేక ఖర్చుకి డబ్బుతో బాటు కాల్చడానికి పుల్లలు కూడా దాచుకో వాల్రా...." అనుకున్నారు తనలో తాను.

మామూలు జ్వరం అనుకున్నది టైఫాయిడ్‌లోకి దింపింది. అంత కంతకీ ఆయన నీరసపడి పోతున్నారు. మధ్యమధ్య పరాకు మాటలొస్తు న్నాయి కూడా. పొలం ఎలా వుందో నన్న ఆందోళన ఆయన్ని నిర్దాక్షి ణ్యంగా నమిలేస్తోంది మరి.

"ఆ పవిత్ర గడ్డ మీద చచ్చే యోగం తన కెలాగూ లేదు. కనీసం ఒక్కసారి ఆ భూదేవి తల్లిని చూసొస్తే బావుణ్ణు హాయిగా కన్నుమూద్దును. దగ్గరికెళ్ళి చూళ్ళేకపోయినా కనీసం దూరాన్నుంచైనా ఆ తల్లిని కనులారా చూసి రెండు చేతులూ జోడించి దణ్ణం పెట్టగలిగితే బావుణ్ణు....ఒక్క సారైనా సరే..." అన్న కోరిక కలిగి పెరిగి శాఖోపశాఖలతో మహా వృక్షమై కూర్చుంది.

ఇక చూడకుండా వుండటం అసాధ్యం అనుకుని ఓ మధ్యాహ్నం ఎవ్వరూ చూడకుండా చూస్తే తెలిస్తే వెళ్ళనివ్వరన్న భయంతో మెల్లగా బయటికొచ్చి రిక్షాలో బస్టాండు కెళ్ళారు.

"నర్సాపురం ఎళ్ళే బస్సేదండి" కనిపించిన వాళ్ళనల్లా అడిగారు.

"తెలుగూ మాలూమ్ నహీఁ"

"యూ ఆర్ టాకింగ్ ఇన్ తెల్గూ?"

"పుదర్ పూచో"

"అదిగో ఆ ఎంక్వైరీ కౌంటర్లో కనుక్కోండి"

అతడు చూపెట్టిన చోటికెళ్ళి కనుక్కున్నారు. ఆ బస్సు రాత్రి ఎనిమిదింటికి వస్తుందన్నారు. అప్పటిదాకా తప్పదనుకుని ఆ ప్రక్కనే చతికిలబడ్డారాయన. అరగంట అరగంటకీ వెళ్ళి అడిగేవారు బస్సెప్పుడొస్తుందీ అని. అంత ఆత్రంగా వుందాయనకి.

ఎట్టకేలకు నర్సాపురం బస్సొచ్చింది. బస్సెక్కి టిక్కెట్టివ్వమన్నారాయన- పంచె ముడి విప్పి రఘు ఇచ్చిన అయిదువందల్లో ఒక వంద కాగితం తీసిస్తూ.

అంతా నవ్వారు.

"ఇక్కడ కాదోయ్ దిగు దిగు"

"దొరగారికి రిజర్వేషన్ లేకుండా టిక్కెట్టు కావాల్ట"

రకరకాల వ్యాఖ్యానాలు చేశారా నాగరికులు.

ఆఖరికో యువకుడు టిక్కెట్టు తీసుకొస్తానంటూ వందనోటు తీసుకెళ్ళాడు. అతడలాగే వెళ్ళిపోవడం ఖాయమని తీర్మానించేశారు బస్సులోని వాళ్ళంతా. కాని అతడొచ్చి టిక్కెట్టూ డబ్బూ రామయ్యగారికిచ్చి సీటు నెంబరు చూపి మరీ కూర్చోబెట్టేసరికి మొఖాలు తిప్పేసుకున్నారు.

బస్సు కదిలింది. అది ఆగుతూ పోవడం ఆయనకి నచ్చేమిరా ఇష్టం లేదు. ఎక్కడా ఆగకుండా అత్యంత వేగంగా వెళ్ళి త్వరగా గమ్యాన్ని చేరిస్తే బావుణ్ణని ఆరాటపడుతున్నారు.

ఎంత రాత్రైనా సరే వెళ్ళి తన పొలం చూసెయ్యాలి. పైరుని సందిట్లోకి తీసుకోవాలి. నేల తల్లికి మొక్కాలి. అంతవరకూ తనకి శాంతి లేదు. మనస్సుకి పూరట వుండదు. ఆ వేదన తగ్గదు. అపలంత వరకూ ప్రాణం పోవడానికి వీల్లేదు గాక వీల్లేదు!

బస్సెప్పుడు నర్సాపురం చేరుతుందా అని నిద్రపోకుండా ఎన్నో లంఖణాలు చేసినా నీరసం మాటెత్తకుండా తన ధ్యానంతా పొలం మీదే కేంద్రీకరించి కూర్చున్నారు.

బస్సు గమ్యం చేరింది. తన వూరెళ్లే బస్సు ఇంకో గంటకి గాని లేదన్నారు. ఒక్క నిమిషం ఆలస్యం కూడా భరించ గలిగే స్థితిలో లేరేమో అడ్డదారి పట్టుకుని నడవసాగారు.

సూర్యుడప్పుడే తీక్షణ దృక్కులు చూస్తున్నాడు.

రామయ్యగారు అలసిపోయారు. ఒళ్లంతా ముచ్చెమటల్తో తడిసి పోయింది. అడుగులు తడబడుతున్నాయి. శరీరం నీరసంతో తూలుతోంది. అయినా పట్టుదలగా ముందుకే నడుస్తున్నారు.

"వెళ్ళాలి....వెళ్ళి తన బంగారు పొలాన్ని చూడాలి· తన తల్లిని కాదు దైవాన్ని చూడాలి. అందుకోసం వెళ్ళాలి. త్వరగా త్వర త్వరగా వెళ్ళాలి. ఏమైనా సరే ఎలాగైనాసరే వెళ్ళాలి....వెళ్లాలి ....త్వరగా...."

ఎవరో ఎదురొచ్చారు.

"మా చేను ఎలాగుందండి? పొట్ట మీదుందా ఈనేసిందా?"

అతడు నోరు తెరిచాడు. మాసిన గెడ్డం మీసాలతో లోతుకు పోయిన కళ్లతో కుషించిన శరీరంతో గుర్తుపట్టలేని విధంగా వున్నారు రామయ్యగారు. ఆయన మళ్లీ అడిగే సరికి పిచ్చివాడు కాబోలనుకుని విన బడనట్టు వెళ్లిపోయాడు.

ఆయనకి ఒళ్లు మండిపోయింది. "మీరెవరూ చెప్పకపోతే నే వెళ్లలే ననుకున్నారా. వెళ్లి చూడలేననుకున్నారా పిచ్చోళ్లా" అంటూ అతడ్ని తిడుతూ మరింత వేగంగా అడుగులేశారు.

అక్కడక్కడా వరిచేలు కోస్తూండటం చూసి "అయితే మా చేనూ కోత కొచ్చేసి వుంటుంది. వెంటనే కోయించెయ్యాలి. కూలీలు దొరికితే ఇవాళే కోయించాలి. అన్నాబిన్నాళ్ళు తనేం చేస్తున్నాడబ్బా వూరివాళ్ళు కోతలు పట్టేసినా ? ఇంకేం ఆలస్యం చెయ్యకూడదు. వీలైతే

ఇవాళే కోత కొయించెయ్యాలి. అన్నట్టు మబ్బులేం పట్టడం లేదు కదా?" అనుకుంటూ ఆగి కళ్ళకి చెయ్యి అడ్డం పెట్టుకుని ఆకాశం వైపు చూశారు. ఫెళ్ళున కాస్తోంది ఎండ. సంతృప్తిగా తలాడించుకుంటూ తన పొలం వైపు నడిచారు.

కొందరాడవాళ్ళు "ఆ రాజుకీనమ్మ వుయ్యాలో— ఏడుగురూ కొడుకులూ వుయ్యాలో—" అని పాడుతూ చేనుకోస్తున్నారు.

ఆ దృశ్యం చూసి శివమెత్తిన వాళ్ళా వూగిపోయారు రామయ్యగారు. "ఎవర్రోయ్ నా చేను కోసేస్తున్న దొంగ లంజా కొడుకు లెవర్రోయ్" అంటూ పై పంచె నడుంకి చుట్టి చేనుకడ్డం పడ్డారు.

కోత ఆగిపోయింది అంతా బొమ్మల్లా నిలబడిపోయారు.

"వెళ్ళిపోండి పోండి...." అని రామయ్యగారు అరుస్తోంటే, గోపాలం గారి పాలేరు వచ్చి "ఏయ్ పిచ్చోడా— వెళ్ళు వెళ్ళు" అంటూ కర్రతో గెంటేశాడాయన్ని చేను బయటికి.

ఆయన గట్టుమీద కూలబడి ఎన్ని తిట్లు తిట్టినా శాపనార్థాలు పెట్టినా ఎవరూ పట్టించుకోలేదు. అలసి సొలసి అక్కడే మూడంకె వేసి పడుకుండి పోయారు.

సాయంత్రం కూలీలంతా వెళ్లిపోయాక పొలంలోకి వెళ్ళారు రామయ్యగారు. ప్రతి అణువూ స్పృశించి ఇన్నాళ్ళూ దూరమైనందుకు ఏడుస్తూ సంజాయిషీ చెప్పుకున్నారు. ఇంకెప్పుడూ వదలను గాక వదల్నని భూదేవి సాక్షిగా ప్రమాణం చేశారు.

మర్నాడంతా వచ్చి చూసేసరికి ఆ చేను మధ్య చలికి బిగుసుకుపోయి కట్టెలా పడున్నది రామయ్యగారి శవం. ఆయన రెండు గుప్పిళ్లలోనూ ఆ పొలం మన్ను!

ఆయన రామయ్యగారని వూరివాళ్లు గుర్తుపట్టేసరికి సూర్యభగవానుడు నడినెత్తి మీద రెండుక్షణాలు పాటు నిలిచిపోయాడు అమితాశ్చర్యానుభూతితో !

—0—

(ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక 8-2-78)